# మా కుక్క

## కాటూరి కృష్ణమూర్తి

ఆ రోజు ఆదివారం. ఉదయం ఏడు గంటలకు ఇంటిదగ్గర కాస్త టీ తాగి మార్కెట్టు కెళ్ళాను. ఒక అరగంటలో కూరగాయలు తెస్తూ ఒక దినపత్రికా తెచ్చుకున్నాను.

మా ఆవిడ కూరగాయల సంచి అందుకుంటూ, నా చేతిలో పేపరు చూసి సణుగుడు ప్రారంభించింది.

"ఆ పేపరుకు పెట్టిన డబ్బులతో మరోపూట కింట్లోకి కూర గడిచేది. అది చదివితే లాభమేమిటో?" అంటూ సంచిలోని కూరగాయలను పరీక్షిస్తోంది.


నాకు ఒళ్ళు మండింది. "రోజూ పేపరు కొన్నందుకు పెన్నిధి అంత తరిగి పోతున్నట్టు ఎందుకంత బాధపడతావు? మనిషై పుట్టాక కనీసం దేశంలో ఎక్కడ ఏమి జరుగుతుందో తెలుసుకోవాలి. ప్రపంచ పరిస్థితు లేమిటో తెలుసుకోవాలంటే రోజూ పేపరు చూడాలి. పేపరు ప్రతిరోజూ ఇంటికొచ్చి ప్రపంచంలోని వింతలు, విశేషాలు అందిస్తుంది. నీ కెందుకులే! వెళ్ళి వంటింట్లో చీకట్లో కూచో. అదే నీకు ప్రపంచం. లాభ నష్టాలు బేరీజు వేసుకుంటూ కూచో. రోజూ నీ సణుగుడు ఉన్నదేగా! వెళ్ళు వెళ్ళు" అన్నాను.

మా ఆవిడ విసురుగా కూరగాయలు సంచిలో కుక్కి ఇంట్లోకి తీసుకెళ్ళింది. నేను పేపరు చదువుకుంటూ కూచున్నాను.

"అమ్మా! చద్దన్నం ఉంటే పెట్టండమ్మా!" అంటూ ఒక ముసలమ్మ, ఒక గుడ్డిపిల్ల గేటుదాటి మా ఆవరణలోకి వచ్చారు. ముసలమ్మకు డెబ్బయ్యే ళ్ళుంటాయి. బాగా మాసిపోయిన బూడిదరంగు కోక కట్టుకుంది. గుడ్డి పిల్లకు పది సంవత్సరా లుంటాయి. చిరిగిన జాకెట్టు, బొడ్డుపైకి ముడి వేసుకొని ఉంది. చిరిగి జీరాడుతున్న నల్ల లంగా. చేతిలో బొడ్డుగిన్నె. ఎడమ చేతిలో ఒక కర్రపుల్ల పట్టుకొని ముసలమ్మ ముందు నిలబడి ఉంది. వాళ్ళిద్దరూ మా ఆవిడ ఎండబోసిన పెసరపప్పుకు దగ్గరగా వచ్చి నిలబడి ఉన్నారు. వాళ్ళను చూడగానే నాకు జాలి వేసింది. నాకు తెలుసు వాళ్ళకు చద్దన్నం కాదుగదా, పాచిపోయింది కూడా మా ఆవిడ పెట్టదని.

వాళ్ళను మరొక ఇంటికి పొమ్మని చెప్పడం మంచి దనుకున్నాను. ఇంతలో ప్రహరీ గేటులోంచి ఒక కుక్క కుంటుకుంటూ రావడం చూశాను. అది మా కుక్కే. తోక ఆడించుకుంటూ అతి వినయంగా నా దగ్గరకు వచ్చింది. నా కాళ్ళు నాకింది. తన శరీరాన్ని నా కాళ్ళకు ఆనించి పడుకుంది. మోర పైకెత్తి నా కళ్ళల్లోకి చూస్తోంది జాలిగా.

సుమారు ఒక సంవత్సరం క్రితం- అంటే నా పెళ్ళిరోజున మా ఊళ్ళో చెంచువాళ్ళ దగ్గర దీన్ని కొన్నాను. వాళ్ళు సారాకు డబ్బులు కావలసి, నాకు ఇరవై రూపాయలకు అమ్మారు. ఈ కుక్కను గురించి వాళ్ళు ఎన్నో గొప్ప విషయాలు చెప్పారు.




నా పర్సు దూరంగా విసిరేసి దాన్ని కుక్కతో తెప్పించి నా చేతికి ఇప్పించారు. ఎలుకలను, ఉడుతలను పట్టి తెచ్చేదట. అటువంటి కుక్కను, జీవనాధారమైన ఈ కుక్కను వాళ్ళు కేవలం ఇరవై రూపాయలకు ఇచ్చారు. సారా కోసం వాళ్ళ సర్వస్వం నా కమ్మేశారంటే తాగుడు మనుషులను ఎంత దిగజారుస్తుందో అర్థమౌతుంది.

నేనూ సరదాపడ్డాను. నేనప్పుడు ఈ మున్సిపాల్టీలో టీచరుగా చేస్తూ ఒక గదిలో వండుకు తినేవాడిని. నా గదిలో ఎలుకల బెడద ఎక్కువగా ఉండేది. వాటిని నిర్మూలించడానికి పని కొస్తుందని కొన్నాను. నాలుగునెలల క్రితమే మా ఆవిడ కాపురానికి వచ్చింది. ఇల్లు మారాను. కానీ ఇల్లాలి చేత కుక్కకు సరైన ఆహారం పెట్టించలేకపోయాను. నేను స్వయంగా వండుకుని తిన్నన్నాళ్ళూ కుక్కకు ఆహారం బాగా పెట్టాను. కాని మా ఆవిడ కాపురానికి వచ్చింది మొదలు దీనికి ఆహారం లేదు. ఎన్నో విధాల మా ఆవిడకు నచ్చ జెప్పడానికి ప్రయత్నించాను. కానీ లాభం లేకపోయింది. చీటికి మాటికి దాన్ని కొడుతూ ఉండేది. దీనిమీదకు ఎన్నిసార్లు పచ్చడిబండ విసిరేసేదో చెప్పలేను. ఒకరోజున ఆ బండతోనే దీని కాలు విరగ్గొట్టింది. ఆ రోజు ఇది 'కుయ్యో కుయ్యో' అంటూ ఎటుపోయిందో ఏమో!

దీనిమూలాన మా ఇద్దరిమధ్య గొడవ ప్రారంభ మయ్యేది. కొత్త కాపురంలో నా కోరిక తీర్చుకోడానికి నేను ఆవిడకు ఏరోజు కారోజు లొంగిపోవలసి వచ్చేది. నేనే ముందు పలకరించి, మంచి చేసుకోవలసి వచ్చేది. అందువల్ల ఆ రోజున దాన్ని వెతకడానికి వెళ్ళలేదు. 'పోతే పోయిందిలే' అనుకున్నాను. దాన్ని తెచ్చి మా ఆవిడచేత తిండి పెట్టించలేక తగాదా తెచ్చుకునే కన్నా ఊరుకోడం మంచి దనుకున్నాను. ఈ రోజు ఆ ముష్టివాళ్ళతో కలిసి వచ్చింది. నన్ను గుర్తుపట్టి వచ్చి నా కాళ్ళ దగ్గర పడుకుంది. "ఈ కుక్క మీ దగ్గర కెప్పుడు వచ్చింది ముసలమ్మా?" అనడిగాను.

"శానా రోజులయింది బాబూ! శానా మంచిదండీ బాబుగోరూ!! నేనెప్పుడన్నా లేవలేకపోతే, ఈ కుక్క మా పిల్ల సేతిలో కర్రపుల్లను నోట కరచుకొని అన్నం అడుక్కొచ్చేది బాబూ! ఇది మా గుడిసెకు 'కియ్యో కుయ్యో' అంటూ వచ్చింది బాబుగోరూ! మా దగ్గర ఉన్న సద్దన్నం పెట్టి కాలుకు తడిగుడ్డ చుట్టి గుడిసెలో కట్టేశాం బాబూ! నాలుగురోజులు అన్నం అడుక్కొచ్చి మేము కొంత తిని, దీనికి పెట్టేవాళ్ళం బాబూ! అప్పటినుంచి మా కెంతో ఆధారమైంది బాబూ" అంటూ ఆ ముసలమ్మ బోసినవ్వుతో పెదవులు పదే పదే చప్పరించుకుంటూ చెప్తోంది.

"ఒకరోజు ఏ మయిందంటే బాబుగోరూ!" అంటూ గుడ్డిపిల్ల ప్రారంభించింది. "మా మామ్మకు చలిజరం వచ్చిందండి. నేను మామ్మ దగ్గరే కూచున్నానండి. ఈ కుక్క ఎక్కడ కెళ్ళిందో ఏటో మద్దేలకల్లా రెండు ఉడతలని పట్టుకొచ్చింది బాబూ! ఆ రోజు వాటినే కాల్చుకు తిన్నాం

బాబుగోరూ!" అని చెప్పింది. ఆ గుడ్డిపిల్ల ముఖంలో అప్పుడు ఎంత ఆనందమో వర్ణించలేను. కొడిగట్టిన గచ్చకాయల్లాంటి కనుగుడ్ల మీద అతివేగంగా నాట్య మాడుతున్న ఆ కనురెప్పలు, కొడిని పడగొట్టి కళ్ళకు కాంతి నివ్వాలని ప్రయత్నిస్తున్నాయా అన్నట్టుగ అతివేగంగా కదులుతున్నాయి. ముఖం మీదకు జారిన ఆ రాగి వెంట్రుకలను నెత్తిమీదకు సవరించుకుంటూ, ముఖాన్ని ఓరగా పెట్టి ఆకాశం కేసి చూస్తూ చెప్పే మాటలు వింటూంటే, నాకెంతో ఆనందం కలిగింది. కాలే కడుపునకు కాసిని గంజినీళ్ళయినా పోయించలేకపోయినా పలకరిస్తేనే పరమానందం పొందుతున్న వాళ్ళను చూస్తే జాలి కలిగింది! చద్దిదైనా పట్టెడన్నం వాళ్ళకు పెడితే, ఇంకెంత ఆనందాన్ని వాళ్ళ






ముఖాల్లో చూడగలనో గదా, అనుకున్నాను. కాని మా ఆవిడచేత వీళ్ళకు పాచిపోయిన అన్నమైనా పెట్టించలేను. వీళ్ళకు లేమిలో కలిమిగా నిలిచి ఆదుకుంటున్న మా కుక్కను చేత్తో నిమిరి ఆనందించాను.

ఇంతలో మా ఆవిడ ఇంట్లోంచి బయట కొస్తూనే "పొండి పొండి! అవతలకు పొండి! తెల్లారిందీ? తయారయ్యారు. ఇక్కడేమీ వండి వార్చలేదు. పోతరా లేదా?" అంటూ పెద్దగా అరిచింది.

చేతిలో ఉన్న నాలుగు కుంకుడుకాయలు రోటిమీద పోసి బండ తీసుకుంది. వాటిని చితకగొట్టడానికి. నా కాళ్ళ దగ్గరున్న కుక్కను చూసింది. "ఈ దిక్కుమాలిన కుక్క ఎప్పుడొచ్చింది? బాగా దగ్గరెట్టు క్కూచున్నారు. తోలండి అవతలకు! దరిద్రపుగొట్టుది!" అంది.

నాకు కోపం వచ్చింది. "దరిద్రపు ముఖంది ఇదికాదు. దీనికి విశ్వాసముంది. ఏనాడో పోయింది. ఇప్పుడు వచ్చి నన్ను పలకరిస్తోంది..."

నా మాటలు పూర్తికాకముందే "నీ కుక్కజావ! 'ఛే' అక్కణ్ణుంచి" అంటూ బండతీసుకుని రోటి దగ్గర నిలబడింది. ఎడమచేతి చూపుడువేలు గేటుకేసి చూపుతూ "వద బయటకు", అంటూ గర్జించింది మా ఆవిడ ఆడ సింహంలా.

నా కాళ్ళ దగ్గర నుంచి కుక్క మెల్లగా లేచి, తోక ముడుచుకొని బెదురుతూ కుంటుకుంటూ నెమ్మదిగా అరుగు మెట్లదాకా వెళ్ళి, ఒక్క గెంతు గెంతి ఆరబోసిన పెనరవప్పు మీద దూకింది. చేతిలో బండను బలంగా విసిరింది మా ఆవిడ. గుడ్డిపిల్ల కెవ్వున వెర్రికేక పెట్టింది.

నా గుండెలు అదిరిపోయాయి. వరుగున పోయి మా ఆవిడ జుట్టు పట్టుకొని అటూ ఇటూ గుంజి, వెనక్కు మెడ విరగదీసి, "ఎన్నిసార్లు చెప్పాను నీకు? కుక్కల మీదికీ, కాకుల మీదికీ రాళ్ళూ రప్పలూ వినరవద్దని, అందితే కొట్టు. లేకుంటే ఏడు!" అన్నాను.

"ఇప్పుడేమయింది. కుక్కకేసిన బండ ఆ గుడ్డిపిల్లకు తగిలింది" అంది.

"ఎక్కడ తగిలిందో ఏమో? గిలగిలా తన్నుకుంటోంది. ఛీ! ఛీ! వెధవవనులూ! నువ్వూను!" అంటూ మా ఆవిడను అవతలకు నెట్టి గుడ్డిపిల్ల దగ్గర కొచ్చాను.

మునలమ్మ శోకాలు పెడుతూ, గుడ్డిపిల్ల చెవులు మూసింది. "అమ్మో! నా బిడ్డో! వలకవేమే తల్లో! బాబుగోరూ! నా మనమరాలు చచ్చిపోతూంది బాబో! మీ కాళ్ళకు మొక్కుతాను బాబో! అయ్యబ్బాబో! నోరు బిగునుకు పోతోంది బాబో! అమ్మో! నా తల్లి మెలికలు తిరిగిపోతోంది! దేవుడో!" అంటూ పెద్దపెట్టున ఏడుస్తోంది.

నిజంగా అలాగే జరుగుతోంది. నా కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. నా కాళ్ళూ, చేతులూ స్వాధీనంలో లేవు. వెన్నుపూసలోంచి వణుకు పుట్టుకొస్తోంది.

రోడ్డున పోయేవాళ్ళు ఒక్కొక్కరే మా ఆవరణలోకి వస్తున్నారు. "ఏమయింది? ఏమిటది? ఎందుకు జరిగింది?"

"పెట్టకపోతే మానె! కొట్టడమెందుకు? పొమ్మంటే పోతారుగా!" అని కొందరు అంటున్నారు. క్రమంగా జనం పెరుగుతున్నారు. "చావగొట్టి అలా చూస్తారేంటండీ హాస్పిటల్‌కు తీసుకెళ్ళక? అలా చూస్తారేం? రిక్షాను పిలిచి వేసుకెళ్ళూ!" అని గద్దింపు.

వెంటనే నేను రోడ్డుమీద కెళ్ళి రిక్షాను తీసుకొచ్చాను. మునలమ్మనూ, పిల్లనూ ఎక్కించి, "రామనాథం గారి ఆస్పత్రికి తీసుకువద. నేను సైకిల్ తీసుకొస్తాను" అన్నాను.

"అయిదు రూపాయలు అవుతుంది బాబూ! తర్వాత కాదంటే కుదరదు" అన్నాడు రిక్షావాడు.

"సర్లే పోనీయ్!" అన్నాను.

గబగబా ఇంట్లోకొచ్చి ప్యాంటు వేసుకొని డబ్బులు కోనం బీరువా తాళాల కోనం నా టేబుల్ సొరుగులో వెతికాను. కనిపించలేదు. గబగబా వంటగదిలోకి వరుగెత్తాను.

కిరోసిన్ స్టౌ కెదురుగా మోకాళ్ళ మీద తల ఆనించి కూచుంది మా ఆవిడ.

"బీరువా తాళాలు" అన్నాను.

తల ఎత్తకుండానే "ఎందుకో?" అంది.

"ఎందుకా? నా రెండు కళ్ళూ తోడుకోడానికి" అన్నాను.

తాళాలు ఘల్లున నా కాళ్ళ దగ్గర కొచ్చి వడ్డాయి. రివ్వున పోయి బీరువా తెరిచాను. పెట్టినచోట డబ్బు లేదు. ఆరు వందలు ఉండాలి. కనిపించలేదు. నా బట్టలు, మా ఆవిడ చీరెలు లాగి దులిపి కింద పారేస్తున్నాను.

"మీ కేమన్నా మతి పోయిందా?! బట్టలన్నీ లాగి పారేస్తారెందుకూ? దుమ్ము కొట్టుకుపోతున్నాయి. వీటన్నిటికి నబ్బు పెట్టాలంటే ఎంత అవుతుందో తెలుసా?" అంటూ నడ్డిన చేతులు పెట్టుకొని వాకిట్లో నిలబడి ఉంది.

"బీరువాలో డబ్బులు తీశావా?"

"నాకు తెలియదు. ఇప్పుడు మీ రెళ్ళి ఆ గుడ్డి దానికి బాగు చేయించాలా?" అంది.

"అవును" అన్నాను.

"లేకపోతే ఏమౌతుందో?" అంటూ దీర్ఘం తీసింది.

"ఆ పిల్ల ఛస్తుంది" అన్నాను కండరాల్ని బిగబట్టి బిగ్గరగా.

"పిల్లా చావదు, పీచూ చావదు! ఆ ముష్టివాళ్ల నంగతి మీకు తెలియదు. దొంగవేషాలు వేస్తారు డబ్బు కాజేయడానికి".

రక్తపు మడుగులో గిలగిలా తన్నుకోడం కళ్ళారా చూచికూడా, జాలి లేకుండా మాట్లాడుతున్నందుకు నా ఒళ్ళు మండిపోతోంది.

"నీ వనలు మనిషివా, రాక్షసివా? బండతో పిల్లను చావగొట్టి పైగా"- ఇక మాట్లాడలేకపోయాను.

"నేను కొట్టాలని కొట్టలేదు. కుక్క మీదకు విసిరాను. అది పోయి తగిలింది గామాల్ను. దానికి ఎవరేం చేస్తారు?" అంటూ బీరువాలో బట్టలు నర్దుతోంది.

నేను మా ఆవిడ జుట్టు పట్టుకొని "మర్యాదగా డబ్బు ఎక్కడ పెట్టావో చెప్పు!" అన్నాను.

గింజుకుంటూ "నాకు తెలియదు" అంది.


ఇహ నహించలేకపోయాను. రెండు గుంజులు గుంజి గిరగిరా తిప్పి, ముందుకు బలంగా తోశాను. వేగంగా పోయి చెక్కబీరువా మూలకు గుద్దుకుంది అమె తల. "అమ్మా!" అని పెద్దకేక పెట్టింది.

"చావవే! చావు! పీడ విరగడై పోతుంది" అంటూ దగ్గరకెళ్ళి కాలు పైకెత్తాను తన్నడానికి. ఆగిపోయాను. ముఖం పైనుంచి రక్తం కారుతోంది. ఆమెలో కదలిక లేదు. నా ఒళ్ళు జల్లుమంది. వెంటనే ఆవిడను చేతులమీద వేసుకొని బయటకొచ్చి, బల్లమీద పడుకోబెట్టి, ఇంటికి తాళం వేస్తుండగా రిక్షావాడు మా ఆవరణలో కొచ్చి "తమరు అరిజెంటుగా రావాలండి బాబూ! రామనాథంగారి ఆసుపత్రి మరెక్కడికో మార్చారంట. వాళ్ళను అక్కడ దించి మీ కోసం వచ్చా" నన్నాడు.

నా కాళ్ళు వణికిపోతున్నాయి. మా ఆవిడను చేతుల మీద వేసుకొచ్చి రిక్షాలో కూచోబెట్టాను. నా ఛాతీమీద ఆవిడ తల ఆనించి పట్టుకొని, రిక్షాను త్వరగా పోనీయమన్నాను. పాపం రిక్షావాడు చాలా వేగంగానే తొక్కాడు. ఆస్పత్రికి చేరేసరికి పదిహేను నిముషాలు పట్టింది. కానీ అక్కడ ఆ గుడ్డిపిల్లా, మునలమ్మా లేరు. వాళ్ళేమయ్యారో తెలునుకోడానికి అక్కడెవ్వరూ లేరు. ఆస్పత్రిని మరెక్కడకో మార్చినట్టు బోర్డు మాత్రం ఉంది.

ఇంతలో రిక్షావాడికి కుక్క కనిపించింది. "బాబుగారూ! అదిగో ఆ నల్లకుక్కను చూడండి! మెడలో ఎర్రరిబ్బను కట్టి ఉంది చూశారూ!! అది ఇందాక మీ నందు మలుపు తిరగ్గానే నా రిక్షా ఎక్కింది. అది వాళ్ళదేనట బాబూ!" అన్నాడు.

దాని నోట్లో గుడ్డిపిల్ల బొడ్డుగిన్నె ఉంది. వాళ్ళెక్కడ గిన్నె మరిచిపోయి పోతే అది తీసుకెళ్ళడానికి వచ్చిందని ఊహించాను. "అవునోయ్! దాని వెనకాలే రిక్షా పోనీయమ"న్నాను.



కుక్క వక్క సందులోకి తిరిగుతోంది. "ఆ సందులో ఒక ఆస్పత్రి ఉంది బాబుగారూ!" అన్నాడు రిక్షావాడు.

వీళ్ళను అక్కడికి ఎవరో చేర్పి వుంటారని ఊహించాను. అక్కడికి పోనీయమన్నాను. అక్కడకే వెళ్ళింది కుక్క. అది డాక్టర్ రవిశంకర్ గారి ఆస్పత్రి. మా ఆవిడను వరండాలో బల్లమీద పడుకోబెట్టాను.

రిక్షావాడు "డబ్బులు బాబూ!" అంటున్నాడు. నా జేబులో ఉన్న ఏడు రూపాయలు ఇచ్చాను. "ఇదేంటి బాబూ! ఇందాక అయిదు రూపాయలు. ఇప్పుడు అయిదు రూపాయలు. మొత్తం పది" అన్నాడు.

"ప్రస్తుతం నా దగ్గర అంతే ఉన్నాయి అంతవరకు సరిపెట్టుకో! కాదుకూడదంటే సాయంత్రం ఇంటికి రా! ఇస్తాను" అన్నాను.

"సర్లెం"దని రిక్షావాడు వెళ్ళిపోయాడు.

నేను మా ఆవిడ తల దగ్గర కూచున్నాను. లోపలనుండి చిన్నగా ఏడ్పు వినిపిస్తోంది. ఆ గొంతు ముసలమ్మది. "దీనికి తల్లి లేదు బాబో! చిన్నప్పుడే కన్నుమూసింది బాబో! ఈ కళ్ళు లేని కబోదిని నా కప్పగించి పోయింది బాబో! మీ కాళ్ళట్టుకుంటాను బాబో!" అంటూ సన్నగా సోకాలు పెడుతోంది.

"నీ మనమరాలికి ఏం భయం లేదు ముసలమ్మా! ఏడవకు!" అంటున్నాడు డాక్టరు.

ఆ మాటలు విన్నాక, నాకు గుండె కుదుట పడింది. పిల్లకు ప్రమాదం తప్పింది. "ఏడుకొండల వాడా! నన్ను రక్షించావు! నీ కొండకు వస్తాను స్వామీ!" అని మనసులోనే మొక్కుకున్నాను.

ఇంతలో డాక్టరు బయటికొచ్చారు. నేను లేచి నిలబడి నమస్కారం చేసి, మా ఆవిడ పరిస్థితి వివరించాను. డాక్టరు మా ఆవిడను పరీక్షించి "ప్రమాదం లేదులెండి. దిమ్మెరదెబ్బ తగిలింది. కంగారు పడవలసిన పనిలేదు". తలమీద గాయాన్ని శుభ్రం చేస్తూ నర్సును పిలిచారు డాక్టరు. 'ఆ గుడ్డిపిల్లను జాగ్రత్తగా చూస్తుండమనీ, ఆ పిల్లలో ఏమాత్రం కదలిక వచ్చి తనతో చెప్ప'మనీ అన్నాడు. నర్సు తల ఊపి లోపలికెళ్ళింది.

నా గుండెలో మళ్ళీ గుబులు, రైళ్ళు పరిగెత్తినట్టు దడ. పిల్ల చావు బ్రతుకుల్లోనే ఉంది. సందేహం లేదు. ఇందాక ముసలమ్మతో 'నీ మనమరాలికి ప్రమాదం లేదన్నారు. అంతా వట్టిదన్నమాట. ముసలమ్మ ఏడుపు మానిపించడానికి అలాచెప్పి ఉంటారు. "ఓరి భగవంతుడా! ఆ పిల్లను బ్రతికించి, నన్ను కాపాడు తండ్రీ!" అని దేవుణ్ణి ప్రార్థించాను. గుండె చిక్కబట్టుకొని డాక్టరు గారినుంచి ఎలాంటి మాట వినవలసి వస్తుందోనన్న భయంతో "ఆ పిల్లకేమయినా ప్రమాదమా సార్?" అని అడిగాను.

"అవునండి. చాలా రక్తం పోయింది. రక్తం కోసం మా కాంపౌండర్ని పంపించాను" అన్నారు డాక్టరుగారు. డాక్టరు గారి చేతులు పట్టుకొని "ఎలాగైనా ఆ పిల్లను బ్రతికించండి సార్! ఎంత ఖర్చయినా నేను భరిస్తాను. ఆ పిల్లకు దెబ్బ తగలడానికి కారణం అదిగో ఆ కుక్కేనండి. ఆ వెధవ కుక్కతో వచ్చిపడ్డాయి ఈ తిప్పలన్నీ!" అంటూ వాకిట్లో కూచున్న కుక్కను చూపెట్టాను.

డాక్టరు ఒక్క క్షణం నాకేసి చూసి, "మీ యావిడ ఈ కుక్కమీది కేసిన బండ ఆ పిల్లకు తగిలిందన్నమాట! తప్పు చేసింది మీ ఆవిడ అయితే, ఆ కుక్కను తిడతారెందుకు? ఇప్పటివరకు ఆ పిల్లను కాపాడింది ఆ కుక్కేనండీ! మీరు వాళ్ళను రిక్షాలో పంపారు. అక్కడ రామనాథం గారి ఆస్పత్రి లేదు. రిక్షావాడు అక్కడ దించి వెళ్ళాడు. దైవికంగా మా నాన్నగారు మార్నింగ్ వాకింగ్‌కు వెళ్ళి వస్తూంటే ఈ కుక్క ఆయన చేతికర్రను నోట కరచుకొని వాళ్ళ దగ్గరకు తీసికెళ్ళిందట. పరిస్థితిని గ్రహించి, వాళ్ళను రిక్షాలో తీసికొచ్చారు మా నాన్నగారు.

"ఎవరో గుడ్డిపిల్లరా పాపం! చాలా ప్రమాదస్థితిలో ఉంది. త్వరగా చూడ"మని చెప్పి ఆ కుక్కను మెచ్చుకున్నారు.

"నేను ఆ పిల్లను పరీక్షిస్తుంటే, కుక్క నా కాలు నాకుతూ 'కుయ్యో! కుయ్యో!' అంటూ వెనక్కాళ్ళమీద నిలబడి నా చేతులు నాకుతూ, ఆ పసుపురంగు కళ్ళతో నాకేసి చూస్తుంటే నా గుండె నీరైపోయింది. ఆ సమయంలో ఈ కుక్క తెలివైన పని చేసిందండీ! ఆలస్యమైతే ఆ పిల్ల చచ్చిపోయేది" అంటూ డాక్టరు మా ఆవిడకు కట్టు కట్టడం పూర్తి చేశారు.

"అడుగో మా కాంపౌండరు వస్తున్నాడు. ఆ పిల్లకు రక్తం ఎక్కించాలి" అంటూ డాక్టరు లోనికెళ్ళారు. కాసేపటికి కాంపౌండరు వచ్చి మా ఆవిడకు ఇంజెక్షన్ చేసి, నాలుగు బిళ్ళలిచ్చి ఒక చీటీ ఇచ్చాడు. దానిమీద ఇరవై రూపాయలు వేసి ఉంది. "ఇప్పుడొక బిళ్ళ వేసి కాఫీ తాగించండి. ఒక గంట ఆగి మరొక బిళ్ళ వేయ"మన్నాడు.

"అలాగేనండి" అన్నాను.

ఆయన లోపలికి వెళ్ళాడు. ఇప్పుడేం చేయాలో నాకు అర్థం కాలేదు. కాఫీ తాగించడానికి నా దగ్గర పైసలు లేవు. డాక్టరు గారి ఫీజు ఇరవై రూపాయలు. ఆ గుడ్డి పిల్లను కాపాడినందుకు బిల్లు ఎంత అవుతుందో ఏమో! ఏమిటి చేయటం అని ఆలోచిస్తూ మా ఆవిడ కేసి చూస్తూ కూచున్నాను.

నా దృష్టి మా ఆవిడ కున్న బంగారు గాజుల మీద పడింది. రెండు చేతులకూ రెండేసి బంగారు గాజులున్నాయి. మెల్లగా మా ఆవిడ కుడిచెయ్యి పట్టుకొని గాజులు లాగడానికి ప్రయత్నించాను. చేతిని బలంగా లాక్కొని రెండు చేతులూ పైటచెంగు కింద దాచుకుంది.

మళ్ళీ నేను చెయ్యి పట్టుకొని బలంగా లాగుతున్నాను. చేతిని విదిలించుకొని, చివుక్కున లేచి ఒక కాగితం పొట్లాం నా మీదకు విసిరికొట్టి చకచకా వెళ్ళిపోతోంది.

ఆ పొట్లాం విప్పి చూశాను- ఆరువందల రూపాయలు. ఆశ్చర్యపోయాను! ఇప్పటిదాకా స్పృహ లేనట్టుగా నటించిందన్న మాట!

పెళ్ళిచూపుల్లో ఆమె అందమైన ముఖంలో నేను చూడలేకపోయినవి కాటుక కళ్ళ వెనుకనున్న కాఠిన్యం, ఓరచూపుల వెనుక ఉన్న క్రూరత్వం, చిరునవ్వుల వెనుక ఉన్న చీదరింపు, ముసిముసినవ్వుల్లో దాగి ఉన్న మూర్ఖత్వం ఈరోజు తెలిశాయి. జాలి అనేది ఆమె జీవితంలో ఎప్పుడైనా కలుగుతుందా? ఏమో!

ఇంతలో డాక్టరు బయటకు వచ్చి "మీ శ్రీమతిని పంపించారా? ఆ బిళ్ళ వేసి కాఫీ ఇచ్చారా?" అని అడిగారు.

"అవునండీ! బిళ్ళ వేసి కాఫీ ఇచ్చాను. ఇంటికెళతానంటే రిక్షాలో పంపాను" అని అబద్ధమాడాను. ఆ పిల్ల సంగతి అడిగాను.

"ప్రాణభయం లేదు. ఒక గది ఏర్పాటు చేశాను. వారం రోజులు ఉండాలి. తలమీది చర్మం చిట్లింది కదా! కుట్లు విప్పేదాకా ఉండాలి" అన్నాడు. డాక్టరు లోపలికి తీసికెళ్ళి పిల్లను చూపెట్టారు. బయటకొస్తూ 'తమ ఫీజు' అంటూ మూడువందలు తీసి డాక్టరు గారికివ్వబోయాను. "వద్దండీ! ఎవరో వస్తారు, ఏదో ఇస్తారని ఆ పిల్లకు చికిత్స చేయలేదండీ! ప్రమాదస్థితిలో ఉన్న ఒక అనాథ అంధురాలికి మానవతా దృష్టితో చేసిన సేవ. నాకివ్వదలచుకున్నదేదో ఆ పిల్లకు ఇవ్వండి. ఈ వారం ఆ పిల్లకు మంచి ఆహారం కావాలి. ఉపయోగపడుతుంది" అన్నారు.

డాక్టరుకు 'థాంక్సు' చెప్పి, కాంపౌండర్‌కు బిల్లు ఇరవై రూపాయలు ఇచ్చి, వాకిట్లో ఉన్న కుక్క నోట్లో మూడు వందల రూపాయలు పెట్టి దాన్ని నిమిర్చి, ఇంటికి బయలుదేరాను- భవిష్యత్తులో భార్యతో గడిపే జీవితాన్ని గురించి ఆలోచిస్తూ! ★

